సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 28 । ఏప్రిల్ । 2023



నేర రహిత సమాజమే..

నేరరహిత సమాజం కోసం పోలీసు, రెవెన్యూ శాఖలు పని చేస్తున్నాయని రాష్ట్ర జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

- 8లో ▸



కొనసాగుతున్న బీఈడీ పరీక్షలు

తెలంగాణ వర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు కొనసాగుతున్నా యని కంట్రోలర్ అరుణ తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.5 /22.9

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం చల్లటి గాలులు వీస్తాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు వర్ష సూచన

సుభాష్‌నగర్ : జిల్లాలో శుక్రవారం పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశముంది. గంటలకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు కూడా వీస్తాయి. అక్కడక్కడ భారీ వర్షం కూడా కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గురువారం సాయంత్రం జిల్లాలోని మోపాల్, డిచ్‌పల్లి, నిజామాబాద్, తదితర మండలాల్లో స్వల్ప వర్షం కురిసింది. రైతులు తమ పంట ఉత్పత్తులను టార్పాలిన్లు కప్పి కాపాడుకోవాలని అధికారులు సూచనలు చేశారు.

డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి : నేడు నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తామని ఆర్‌ఎం ఉషాదేవి తెలిపారు. ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు క్రింది నెంబర్లకు డయల్ చేయాలన్నారు.

రీజనల్ మేనేజర్, నిజామాబాద్	99592 26011
డిపో మేనేజర్, ఆర్మూర్	99592 26019
డిపో మేనేజర్, బోధన్	99592 26001
డిపో మేనేజర్, నిజామాబాద్-1	99592 26016
డిపో మేనేజర్, నిజామాబాద్-2	99592 26017
డిపో మేనేజర్, కామారెడ్డి	99592 26018
డిపో మేనేజర్, బాన్సువాడ	99592 26020

దెబ్బ తిన్న పంటల పరిశీలన



బాల్కొండ : మెండోరా మండల పరిధిలో అకాల వర్షాలకు దెబ్బతిన్న నువ్వులు, వరి పంటలను వ్యవసాయ అధికారి రాజుకుమార్ గురువారం పరిశీలించారు. వడగండ్ల వానతో వరి, నువ్వు, సజ్జ పంటలు దెబ్బతిన్నాయన్నారు. త్వరలోనే ఏఈవోలను పంపి సమగ్ర సర్వేను నిర్వహిస్తామన్నారు. తుది నివేదికను ఉన్నత అధికారులకు అందిస్తామన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ మచ్చర్ల రాజారెడ్డి, ఏఈవోలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు వాపస్


మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని పలు గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారుల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల గడువు ముగియడంతో అధికారులు వెనక్కి పంపిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెక్కులు వస్తాయని ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న లబ్ధిదారులు మరికొంతకాలం వేచి చూడాల్సిందే. కాగా ఇదే విషయమై తహసీల్దార్ లతను సంప్రదించగా, ఆర్థిక సంవత్సరం మార్చి చివరి వారంలో చెక్కులు వచ్చాయని, బడ్జెట్ ల్యాప్స్ అవుతాయనే ఉద్దేశంతో లబ్ధిదారులకు పంపిణీ చేయలేదన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 40 మంది లబ్ధిదారులను కలుపుకుని కొత్త చెక్కులు అందిస్తామన్నారు.

జీజీహెచ్ జూడా ప్యానల్ ఏర్పాటు



నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం జరిగిన సమావేశంలో నూతన జూనియర్ డాక్టర్స్ (జూడా 2022–23) ప్యానల్ ఏర్పాటైంది. ఈ సందర్భంగా జూడా నూతన అధ్యక్షుడు డాక్టర్ సురేష్ జూడా విధుల గురించి మాట్లాడారు. ప్రధాన కార్యదర్శిగా పూజిత, వైస్ ప్రెసిడెంట్ హరిత, కోశాధికారి రక్షిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ పవన్, జాయింట్ సెక్రటరీలు జయంత్ సాత్విక్ (పీఆర్వో), సంపత్, సుర్జిత్, తదితరులు ఉన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



సుభాష్‌నగర్: నగర శివారులోని కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ భగీరథుడి స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి నర్సయ్య, బీసీ సంఘాల ప్రతినిధులు నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, రాజేశ్వర్ తదితరులున్నారు.

‘కూలి’న బతుకులు

ఆటోలో మృతదేహాలు, చేయి తెగిపోయిన కృష్ణ



వారంతా కష్టజీవులు.. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. ఏ పూటకాపూట కూలి పనులు చేసుకుంటూ జీవించే వారి జీవితాలను రోడ్డు ప్రమాదం బలిగొంది. వీరిపై ఆధారపడిన కుటుంబాలు చీకటిమయం అయ్యాయి. సొంత ఊరిలో ‘ఉపాధి’ కరువై.. పనులు దొరక్క.. నిత్యం 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి జిల్లా కేంద్రంలో పనులు చేసుకుంటారు. ఇలా రోజుమాదిరి వెళ్లిన నలుగురు కూలీలు అర్సపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు అవిటి వారయ్యారు. ఒకరి చేయి తెగిపోగా, మరొకరి రెండు కాళ్లు తెగిపోయాయి.



ఘటనా స్థలం వద్ద బొలెరో, ఆటో

తండ్రీకొడుకులు



శ్యామ్ (ఫైల్)



యశ్వంత్ (ఫైల్)



ప్రశాంత్ (ఫైల్)



రేఖ (ఫైల్)

అర్సపల్లి బైపాస్ రోడ్డు

నలుగురిని బలిగొన్న మృత్యు శకటం

- అర్సపల్లి బైపాస్ రోడ్డు వద్ద ఆటోను ఢీకొన్న బొలెరో వాహనం
- ఒకరి చేయి తెగిపోయి.. మరొకరి రెండు కాళ్లు తెగిపోయి భయానకంగా మారిన ఘటనా స్థలం
- మృతులు ఊట్‌పల్లి వాసులు
- ఐటీహబ్‌లో కూలి పనులు చేసి వెళ్తుండగా ఘటన



జిల్లా జనరల్ ఆస్పత్రిలో మృతుల బంధువుల రోదనలు



రేఖ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

ఖలీల్‌వాడి/బోధన్ రూరల్ : వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి నలుగురి ప్రాణాలు తీసింది. మరో ఇద్దరిని వికలాంగులుగా మార్చింది. జిల్లా కేంద్రంలోని అర్సపల్లి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఈ ప్రమాద ఘటన చోటు చేసుకుంది. గురువారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోధన్ వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం, నిజామాబాద్ వైపు నుంచి వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను ఎదురుగా అతి వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే నలుగురు మృతి చెందారు. ఒకరికి ఎడమ చెయ్యి, మరొకరికి రెండు కాళ్లు తెగిపోయాయి. ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆటోలో మొత్తం తొమ్మిది మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా జిల్లా కేంద్రంలోని ఐటీ హబ్‌లో గత కొన్ని రోజులుగా పని చేస్తున్నారు. ఐటీహబ్‌లో పనులు ముగించుకొని బోధన్ మండలంలోని స్వగ్రామం ఊట్‌పల్లికి ఆటోలో వెళ్తుండగా ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదం జరగ్గానే స్థానికులు ఆరవ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన చేరుకుని క్షతగాత్రులను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం ఢీకొన్న వేగానికి ప్యాసింజర్ ఆటో నుజ్జునుజ్జు అయింది. బొలెరో వాహనం బోల్తా పడింది. ఆటోలో ఉన్న దియావత్ శ్యామ్(45), దియావత్ యశ్వంత్ (25)(వీరిద్దరు తండ్రీకొడుకులు), రత్నావత్ ప్రశాంత్ (28), అక్కడికక్కడే మృతి చెందారు. రుదావత్ రేఖ(29)కు తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో ప్రాణాలు విడిచింది. రేఖ భర్త కృష్ణకు తీవ్రగాయాలు అయ్యాయి. మరో ఇద్దరు రతావత్ కృష్ణ ఎడమచేయి తెగిపోగా, రుదావత్ కృష్ణ రెండు కాళ్లు తెగిపోయాయి. పోలీసులు ఆటోలో ఉన్న మృతదేహాలను బయటకు తీశారు. గాయాలైన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదం జరిగిన వెంటనే బొలెరో డ్రైవర్ పరారయ్యాడు.

మృతుల్లో తండ్రీ కొడుకులు..

బోధన్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు దియావత్ శ్యాం(45), దియావత్ యశ్వంత్(25) ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డారు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇద్దరు కూలీ పనులకు వెళ్తేగాని ఇల్లు గడవని స్థితిలో వారిద్దరూ మృత్యువాత పడడంతో వారి కుటుంబం ప్రస్తుతం దిక్కులేనిదైంది. దియావత్ శ్యాంకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య లక్ష్మీ కొడుకు యశ్వంత్. యశ్వంత్‌కు ఇటీవలే పెళ్లయింది. మరో ఇద్దరు మృతుల్లో రత్నావత్ ప్రశాంత్‌కు భార్య సుష్మ, కొడుకు, కూతురు ఉన్నారు. రుదావత్ రేఖకు భర్త కృష్ణ, కొడుకు, కూతురు ఉన్నారు.

సొంత ఆటోలోనే ప్రాణాలొదిలి..

రత్నావత్ ప్రశాంత్ సొంత ఆటోలో నిత్యం కూలీలను తీసుకెళ్తూ వస్తుంటాడు. ఇదే విధంగా ఐటీ హబ్‌లో పనులు ముగించుకున్న కూలీలను తన ఆటోలో తీసుకెళ్తుండగా అర్సపల్లి బైపాస్ వద్ద బొలెరో వాహనం ఢీకొట్టింది. బోధన్ మండలంలోని ఊట్‌పల్లిలో కూలీలు ఎక్కడికి పనికి వెళ్తే అక్కడికి వారిని తన ఆటోలోనే తీసుకెళ్తూ వస్తుంటా డు. చివరికి బొలెరో వాహనం అతివేగానికి ఆదే ఆటోలో ప్రాణాలొదిలాడు. బొలెరో వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టి అనంతరం రోడ్డు పక్కన బోల్తా పడిందంటే అది ఎంత వేగంగా వెళ్తుందో తెలుస్తోంది. ప్రశాంత్ తండ్రి ఆర్టీసీ డ్రైవర్.

రిజిస్ట్రార్ కుర్చీ చుట్టూ రాజకీయాలు!

- తెలంగాణ వర్సిటీలో వ్యవహారాలపై విమర్శలు
- వీసీ నియమించిన రిజిస్ట్రార్‌పై క్రిమినల్ చర్యలకు పాలకమండలి తీర్మానం
- వీసీ లేకుండానే ఈసీ సమావేశాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : భావి భారత పౌరులైన విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన తెలంగాణ విశ్వవిద్యాలయంలో చోటుచేసుకుంటున్న వ్యవహారాలు ప్రత్యక్ష రాజకీయాలను తలపిస్తున్నాయి. ముఖ్యంగా రిజిస్ట్రార్ల నియామక అంశం ఓ కుర్చీలాటగా మారింది. చివరకు పరిస్థితి ఎలా తయారైందంటే వైస్ చాన్స్‌లర్ నియామకం ద్వారా రిజిస్ట్రార్‌గా బాధ్యతలు తీసుకుంటే.. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకునే విధంగా పాలకమండలి తీర్మానం చేయడం చర్చనీయాంశమైంది. అసలు పాలకమండలి అనుమతి లేకుండానే వైస్ చాన్స్‌లర్ నిర్ణయాలు తీసుకోవడం, నియామకాలు చేపట్టడం, ఖర్చులు చేయడాన్ని పాలక మండలి తీవ్రంగా పరిగణిస్తోంది. పైగా వైస్ చాన్స్‌లర్ లేకుండానే పాలకమండలి సమావేశాలు ఈసీ నిర్వహిస్తుండడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ క్రమంలో తాజాగా ఈ నెల 26న జరిగిన ఈసీ సమావేశంలో కఠినమైన చర్యలకు పూనుకోవడం విశేషం. వృక్షశాస్త్రం ప్రొఫెసర్ విద్యావర్ధినిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ పాలకమండలి తీర్మానించింది. అదేవిధంగా పాలకమండలి అనుమతి లేకుండా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా వ్యవహరించిన విద్యావర్ధిని పదవీకాలాన్ని గుర్తించేది లేదని నిర్ణయించారు. ఆర్థిక అవకతవకలపై విచారణ పూర్తయ్యేవరకు విద్యావర్ధిని వర్సిటీలోకి రావొద్దని ఆంక్షలు పెట్టారు. విద్యావర్ధిని నిర్దోషిగా నిరూపించుకుంటేనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించారు. పైగా వర్సిటీలో వీసీ రవీందర్, విద్యావర్ధిని పాల్పడిన అవకతవకలకు సంబంధించి ఏసీబీకి సైతం ఫిర్యాదు చేసి విచారణ చేయించాలని నిర్ణయించారు.

- 2021 అక్టోబర్ 30న పాలకమండలి ఆమోదంతో ఉన్నతవిద్యా శాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ సమక్షంలో అప్పటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కనకయ్యను తొలగించి యాదగిరిని నియమించారు. ఆ తరువాత చివరిసారిగా 2021 నవంబర్ 27న ఈసీ సమావేశం జరిగింది. అయినప్పటికీ వీసీ రవీందర్ యాదగిరిని తొలగించి 2021 డిసెంబర్ 9న శివశంకర్‌ను రిజిస్ట్రార్‌గా నియమించారు. తరువాత మళ్లీ 2022 ఆగస్టు 17న శివశంకర్‌ను తొలగించి విద్యావర్ధినిని నియమించారు. గత 17 నెలలుగా పాలకమండలి సమావేశం ఏర్పాటు చేయకుండా అక్రమ వ్యవహారాలన్నీ యథేచ్ఛగా సాగించడం గమనార్హం. పాలకమండలి సమావేశం, ఆమోదం లేకుండానే వీసీ ఇష్టం వచ్చినట్లు వ్యవహారాలు చక్కబెట్టుకోవడం వంటి పరిణామాలు ప్రభుత్వమే విస్తుపోయేలా చేసింది. అయితే యాదగిరిని రిజిస్ట్రార్‌గా ఈసీ నియమించడంతో పాటు విస్తృతంగా ఆర్థిక అధికారాలు కట్టబెట్టడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఏడాదిన్నర కాలంలో ఇప్పటివరకు వీసీ, రిజిస్ట్రార్‌ల విచ్చలవిడితనానికి వర్సిటీలో కోట్లాది రూపాయలు దుర్వినియోగమయ్యాయి. ఈ క్రమంలో తాజాగా నియమించిన రిజిస్ట్రార్ యాదగిరికి పూర్తి బాధ్యతలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో యాదగిరి సైతం ఇక తనకు ఎదురు లేదంటూ ఏకపక్షంగా వ్యవహరించే అవకాశాలు లేకపోలేదని వర్సిటీలో ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు అంటున్నారు.

విషయమేమిటంటే రిజిస్ట్రార్ యాదగిరి వివిధ అంశాలను అధికారికంగా వెల్లడించకుండా లీకులు ఇస్తూ ముందుకెళుతుండడంతో విమర్శలు వస్తున్నాయి. ఈ విధంగా మరో దశ రాజకీయాలకు రంగం సిద్ధం చేస్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. మొత్తంగా తెలంగాణ వర్సిటీలో రిజిస్ట్రార్ సీటు కేంద్రంగా విచ్చలవిడి రాజకీయాలు చోటుచేసుకుంటుండడం చర్చనీయాంశం అయ్యింది.

చెస్‌తో మైండ్ పవర్ పెరుగుతుంది



నాగజ్యోష్నికకు ప్రథమ బహుమతి అందజేస్తున్న డీపీవో జయసుధ, కాకతీయ ఒలంపియాడ్ డైరెక్టర్ తేజస్విని

చెస్ ఆడడం ద్వారా ఏకాగ్రతతో పాటు మైండ్ పవర్ పెరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ పేర్కొన్నారు. ‘సాక్షి’ ఆధ్వర్యంలో గురువారం కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో నిర్వహించిన చెస్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది.

-వివరాలు 8లో..

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ..

- కానిస్టేబుల్ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి
- మహిళలకు గోరింటాకు పెట్టుకోవద్దని సూచన
- జిల్లాలో 12 సెంటర్లు, 5,285 మంది అభ్యర్థులు
- ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్

ఖలీల్‌వాడి : పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ఫైనల్ రాత పరీక్షకు పకడ్బందీగా నిర్వహిస్తామని, నిర్ణీత సమయానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షకేంద్రంలోకి అనుమతించమని నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ఆడిటోరియంలో ఉదయం 11 గంటల నుంచి 2 వరకు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాత పరీక్షకు 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

నిజామాబాద్‌లో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల, యూజీబ్లాక్, పీ.జీ బ్లాక్, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల, కేర్ డిగ్రీ కళాశాల, గౌతమి డిగ్రీ కళాశాల, నలంద డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్, ఎస్ఆర్ జూనియర్ కళాశాల (దాస్‌నగర్), నవ్యభారతి గ్లోబల్ స్కూల్, కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్, ఎస్ఆర్ జూనియర్ కళాశాల (ఆర్మూర్ రోడ్డు), ఎస్ఆర్ జూనియర్ కళాశాల (బ్యాంక్ కాలనీ), ఎస్‌వీ (శ్రీ వాగ్దేవి) డిగ్రీ కళాశాలలో ఈ పరీక్ష జరుగనుంది.

కమిషనరేట్ పరిధిలో..

పోలీస్ కమిషనరేట్ పరిధిలో 5,285 మంది అభ్యర్థులు తుదిరాత పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయని, అభ్యర్థులు హాల్‌టికెట్లపైన ఫొటోతో పరీక్ష కేంద్రానికి రావాలని బ్లూ లేదా బ్లాక్ బాల్పాయింట్ పెన్ తీసుకొని రావాలని, ఎలాంటి గుర్తింపు కార్డులు అవసరం లేదన్నారు.

సెల్‌ఫోన్లు, వాచ్‌లు అనుమతించం..

అభ్యర్థులకు బయోమెట్రిక్ పద్ధతిలో హాజరు తీసుకుంటామని, అభ్యర్థులు పరీక్ష సమయానికి ఒక గంట ముందుగానే (ఉదయం 9 గంటలకు) పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. 10 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. హాల్‌టిక్కెట్లలో నిబంధనలు చదువుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, వాచ్‌లు అనుమతించమని, మహిళలు గోరింటాకు పెట్టుకోవద్దని, బయోమెట్రిక్ హాజరు పడకపోవచ్చన్నారు.

దళారులను నమ్మవద్దు

అభ్యర్థులు దళారుల మాటలు విని మోసపోవద్దని, అలాంటి వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. బస్టాండ్ వద్ద పరీక్ష కేంద్రాలకు సంబంధించి రూట్‌మ్యాప్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ రాత పరీక్ష పూర్తిగా రాంమోహన్ రెడ్డి రీజినల్ కో–ఆర్డినేటర్ (గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్), మధుసూదన్ రావు, నిజామాబాద్ నోడల్ ఆఫీసర్, డీసీపీ (అడ్మిన్) సమక్షంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గిరిరాజు, అదనపు డీసీపీ (ఎ.ఆర్), ఏసీపీలు కిరణ్ కుమార్, ప్రభాకర్ రావు, కిరణ్ కుమార్, నారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ కెమిస్ట్రీ విభాగం డాక్టర్ సునీత, అదనపు రీజినల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కుమార స్వామి, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే..

- మహిళల సాధికారత కోసం మోదీ కృషి
- రాష్ట్రంలో పంట నష్టంపై కేంద్రానికి నివేదిక సమర్పిస్తా
- కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి పర్షోత్తం రూపాల



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి

కామారెడ్డి టౌన్ : రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని.. ఇందుకోసం మహిళలు, ప్రతిఒక్కరూ కృషి చేయాలని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో లక్ష్మిదేవి గార్డెన్‌లో జరిగిన జహీరాబాద్ పార్లమెంట్ ప్రవాస్ యోజన, నియోజకవర్గ డ్వాక్రా మహిళల సమావేశంలో ఆయన ప్రసంగించారు. మహిళలే భారతీయ కుటుంబ వ్యవస్థ మూలాలను, వారు కుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేస్తారన్నారు. గతంలో మోదీ సర్కారు రాక ముందు మహిళలు పడుతున్న ఇబ్బందులు చూసి మహిళల సాధికారత కోసం ఎంతో కృషి చేశారన్నారు. స్వచ్ఛభారత్ ద్వారా ఇంటింటికి మరుగుదొడ్లు నిర్మించారన్నారు. ప్రతి బూత్‌లో సగానికి పైగా మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. రాష్ట్రపతి, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ఇలా ఎందరో మహిళలకు సముచిత స్థానం బీజేపీతోనే సాధ్యమైందన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంతో పాటు కామారెడ్డి జిల్లాలో అన్ని సీట్లు బీజేపీకే రావాలని, ఇందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాల న్నారు. బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే గెలుపు సులభతరం అవుతుందన్నారు. రాష్ట్రంలో సాగుతున్న అవినీతి, కుటుంబ పాలన అంతం కావాలన్నారు. అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. ఇటీవల అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట నష్టంపై కేంద్రానికి నివేదిక ఇస్తానని తెలిపారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ డైరెక్టర్ డాక్టర్ మురళీధర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ నియంత పాలన, పోలీసుల రాజ్యం నడుస్తుందన్నారు. అంతకు ముందు ఉదయం కామారెడ్డి పట్టణ కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో కేంద్ర మంత్రి పూజలు నిర్వహించారు. సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా భగీరథ జయంతి



కామారెడ్డి క్రైం: మహర్షి భగీరథ తపస్సుతో ఆకాశం నుంచి గంగ భూమి పైకి వచ్చిందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి భగీరథ జయంతి ఘనంగా నిర్వహించారు. భగీరథ చిత్రపటానికి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, సహాయ సంక్షేమ అధికారి యాదగిరి, వసతి గృహాల యూనియన్ అధ్యక్షుడు చక్రధర్, బీసీ సంఘాల నేతలు నాగరాజు, రాజయ్య, శివరాం, మోహనచారి, సుదర్శన్, అధికారులు నరేష్, పవన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు గురువారం 1303 మంది విద్యార్థులకు గానూ 1236 మంది హాజరు కాగా 67 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ అరుణ తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ నమోదు కాలేదని ఆమె చెప్పారు. తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న బీపీఈడ్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు గురువారం 22 మంది విద్యార్థులకు 18 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఓపెన్ పరీక్షల్లో ఇద్దరి డిబార్

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన పరీక్షల్లో ఇద్దరిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

జువైనల్ హోంకు బాలనేరస్తుడి తరలింపు

ఖలీల్‌వాడి: దోపిడి చేసిన నేరం రుజువైనందున 17 ఏళ్ల బాలుడిని ఏడాది ప్రభుత్వ జువైనల్‌హోంలో ఉంచాలని నిజామాబాద్ బాలల న్యాయ మండలి చైర్ పర్సన్ (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి) కుశనపల్లి సౌందర్య తీర్పునిచ్చారు. నగరంలోని హమాల్‌వాడీకి చెందిన చాట్ల శివ, అతని స్నేహితుడైన సదరు బాలుడు 15 మే, 2019న రాత్రి సమయంలో ఒకరిపై దాడి చేసి, అతని జేబులో నుంచి రూ.18 వేలు, రెండు సెల్‌ఫోన్స్ తీసుకున్నారు. న్యాయ విచారణను నిర్వహించిన బాలల న్యాయ మండలి బాలుడిపై దోపిడీ నేరం మాత్రమే రుజువు అయినట్లు నిర్ధారిస్తూ ఏడాది హైదరాబాద్‌లోని ప్రభుత్వ పరిశీలక గృహంలో ఉంచాలని తీర్పు చెప్పింది. కాగా నేరారోపణలు ఎదుర్కొంటున్న మరో ముద్దాయి శివ కేసును వేరు చేసి నిజామాబాద్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టుకు కేసు చార్జిషీట్ పంపించారు. కేసు విచారణ దశలో ఉండగానే అతను హత్యకు గురయ్యాడు.

చదరంగంతో ఏకాగ్రత





సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన చదరంగం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విజేతలతో డీపీవో జయసుధ, కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ తేజస్విని తదితరులు







మాట్లాడుతున్న డీపీవో జయసుధ

- జిల్లా పంచాయతీ అధికారి జయసుధ
- సాక్షి చెస్ పోటీలకు అపూర్వ స్పందన

నిజామాబాద్‌నాగారం: విద్యార్థులకు చిన్నప్పటి నుంచి చెస్ నేర్పించడంతో ఏకాగ్రతతో పాటు మైండ్ పవర్ పెరుగుతుందని జిల్లా పంచాయతీ అధికారి జయసుధ అన్నారు. నగరంలోని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో గురువారం సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో భాగంగా ఐదు, ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. డీపీవో మాట్లాడుతూ చెస్ ఆలోచన శక్తిని, ప్రశాంతతను పెంచుతుందన్నారు. సాక్షి మీడియా విద్యార్థులను ప్రోత్సహించడానికి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తాను ఇప్పటికీ పత్రికల్లో వచ్చిన ఫజిల్స్, సూడోకు, చిన్న పిల్లల గేమ్‌లకు సంబంధించి బొమ్మలపై కలర్‌లు వేయడం చేస్తానని చెప్పారు.

మానసిక ప్రశాంతత..

చెస్ విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందించడమే కాకుండా మానసిక ప్రశాంతతను ఇస్తుందని కాకతీయ ఒలంపియాడ్ స్కూల్ డైరెక్టర్ తేజస్విని అన్నారు. ఇతర క్రీడల్లో కన్నా చెస్ ఆడే పిల్లలో మేథోశక్తి మెరుగ్గా ఉంటుందన్నారు. నిత్యం చెస్ ఆడడంతో మైండ్ రిలీఫ్ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు క్రీడలను ప్రోత్సహించడం శుభపరిమణన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నటరాజ్, కళాశాల ఇన్‌చార్జి శ్రీలత, చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, చెస్ ఆర్బిటరీ వేణుమాధవ్‌రావు, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి భద్రారెడ్డి, ఏఎస్ఎం మల్లికార్జున్‌యాదవ్, ఆర్‌సీ ఇన్‌చార్జి సంజీవ్, సిబ్బంది నర్సయ్య, రాజ్‌కుమార్, రాజలింగం, ఆనంద్‌కుమార్, రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ దొరికితే చెస్ ఆడతా



చెస్‌లో సబ్ జూనియర్ స్థాయిలో రాష్ట్ర స్థాయికి వెళ్లాను. చిన్నప్పటి చదరంగం నేర్చుకుంటున్నాను. సాక్షి నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలవడం సంతోషంగా ఉంది. వేసవిలో ఖాళీగా ఉండకుండా ఇంటి వద్ద, స్నేహితులతో చెస్ ప్రాక్టీసు చేస్తుంటాను. ఖాళీ సమయం దొరికితే చెస్ ఆడుతాను.

– నాగజోష్నిక, అభ్యాస స్కూల్

చదరంగం అంటే ఇష్టం



నాకు చెస్ అంటే చాలా ఇష్టం. సబ్ జూనియర్ స్థాయిలో రాష్ట్రస్థాయిలో పతకం సాధించాను. సాక్షి నిర్వహించిన పోటీల్లో పాల్గొనడంతో రన్నర్‌గా నిలిచాను. మళ్లీ విన్నర్‌గా నిలవడానికి మెలకువలు నేర్చుకుంటాను.

– రోషిణి, అభ్యాస స్కూల్

నాన్నను ఒప్పించి..



సాక్షి మీడియా చెస్ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకొని మా నాన్నను ఒప్పించి మరీ బాల్కొండ నుంచి వచ్చాను. చెస్‌లో వరుసగా నాలుగు రౌండ్‌లలో విజేతగా నిలవడంతో పాటు ట్రోఫీని గెలిచాను. మా నాన్న నాపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టాను.

– నివాస్, వెంకటేశ్వర స్కూల్, బాల్కొండ

చదరంగంపై మక్కువతో..



చెస్‌పై మక్కువతో కామారెడ్డి నుంచి మా అన్నయ్యతో కలిసి ఇక్కడికి వచ్చాను. నాకు చిన్నప్పటి నుంచి చెస్ అంటే చాలా ఇష్టం. సాక్షి పత్రికలో చెస్‌పోటీలు చూసి వచ్చి పోటీల్లో రన్నర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చదరంగం పోటీలు ఉన్నా పాల్గొంటాను.

– అక్షయ్‌కుమార్, రెయిన్ బో స్కూల్, కామారెడ్డి

చెస్ ఆడడంతో పరిణతి చెందుతారు



ఇప్పటి వరకు చాలా మంది పిల్లలకు చెస్‌లో శిక్షణ ఇచ్చాను. జిల్లాలో ఎక్కడ పోటీలు ఉన్నా అసోసియేషన్ వాళ్లు కోచ్‌గా తీసుకుంటారు. చెస్ ఆడడంతో విద్యార్థులు పరిణతి చెందుతా రు. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పో టీలకు కోచ్‌గా రావడం సంతోషంగా ఉంది.

– వేణు మాధవరావు, చెస్ ఆర్బిటర్

'సాక్షి'కి కృతజ్ఞతలు



చెస్ పోటీలు నాలుగు రౌండ్‌లలో నిర్వహిస్తాం. జంబ్లింగ్ పద్ధతిలో పోటీలు నిర్వహిస్తాం. దీంతో ఎవరు ఎన్ని పాయింట్లు సాధించారో తెలుస్తుంది. దీని ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తాం. చెస్‌తో మానసికత ప్రశాంతత లభిస్తుంది. పోటీలు నిర్వహించిన సాక్షికి కృతజ్ఞతలు.

– ఎ రమేష్, చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి

ఇష్టారాజ్యంగా ట్రేడ్ లైసెన్సుపై లోకాయుక్త సీరియస్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని హైమద్‌పుర కాలనీకి చెందిన మహ్మద్‌పారుఖ్ తన రెండు మడిగెల నుంచి అద్దెకున్న వారిని ఖాళీ చేయించకుండా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంతో పాటు ట్రేడ్ లైసెన్సుల్లో విషయంలో చీటింగ్ చేయడంపై లోకాయుక్త సీరియస్ అయింది. ఫిర్యాదుదారుడు మహ్మద్‌ఫారుఖ్ తనకు జరిగిన అన్యాయంపై, అక్రమాలకు పాల్పడి ఇబ్బందులకు గురిచేసిన మున్సిపల్ అధికారులపై నేరుగా ఈ నెల 1న హైదరాబాద్‌లో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ చిత్రామిశ్రాతో పాటు శానిటేషన్ ఎమ్‌హెచ్‌ఓ సాజీద్‌అలీ, గతంలో పని చేసిన ఎమ్‌హెచ్‌ఓ శ్రీనివాస్, టీపీవో కరుణాకర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఓ నరేందర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ నటరాజ్, బిల్లర్‌లు రాజేష్, సురేష్, బిల్‌కలెక్టర్ సర్వర్‌ఖాన్, నాలుగోటౌన్ ఎస్సై సందీప్‌పై మొత్తం 12మందిపై లోకాయుక్తాలో కేసు నమోదైంది. త్వరలో నిజానిజాలు తెలుసుకోవడానికి లోకాయుక్త ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది.

హైమాదపూర్‌కాలనీలో ఎండీ ఫారుఖ్ తండ్రి తన రెండు మడిగెలు(దుకాణాలు) 11 నెలల నిమిత్తం 2003లో అబ్దుల్ రహీంతో ఓరల్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. అతడి పెద్ద కొడుకు 2010లో అబ్దుల్ రహీంతో అగ్రిమెంట్ రాసుకున్నాడు. అనంతరం అతడు దుబాయి వెళ్లాడు. అగ్రిమెంట్ కాల వ్యవధి ముగియడంతో మూక్ధూం చిన్నకొడుకు ఎండీ ఫారుఖ్ మడిగెలను ఖాళీ చేయాలని అబ్దుల్ రహీంకు చెబితె వినకుండా 2013లో కోర్టును ఆశ్రయించడంతో స్టే మీద 2016 సెప్టెంబర్ 29వరకు ఇదే మడిగెల్లో వ్యాపారం చేసుకున్నాడు. స్టే ముగిసినా ఖాళీ చేయలేదు. మున్సిపల్ నిబంధనల ప్రకారం ఒక వ్యాపారికి ట్రేడ్ లైసెన్సు పొందాలంటే మడిగె ఓనర్‌తో రెంటల్ డీడ్, లీజ్ డీడ్ సమర్పించాలి. ఇవేమీ లేకున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ట్రేడ్ లైసెన్సు జారీ చేశారు. ఇదే విషయమై క్యాన్సిల్ చేయాలని, రెండు మడిగెలను సీజ్ చేయాలని పలుమార్లు మున్సిపల్ అధికారులకు, కలెక్టర్, స్థానిక పోలీసులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో లోకాయుక్తాను ఆశ్రయించాడు.

విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మన్‌కు గాయాలు



లింగంపేట: మండలంలోని ముంబోజీపేట సమీపంలో గురువారం జూనియర్ లైన్ మన్ బ్యాగరి దేవయ్యకు విద్యుత్ షాక్ తగిలి గాయాలైనట్లు ఏఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఈదురు గాలులు, వడగళ్ల వాన కారణంగా ముంబోజీపేట గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో జూనియర్ లైనమన్‌తో పాటు మరికొంత మంది సిబ్బంది మరమ్మతులు చేయడానికి వెళ్లారు. గ్రామానికి వెళ్లే 11 కేవీ విద్యుత్ వైర్లు సరిచేయడానికి ముంబోజీపేట ఫీడర్‌కు ఎల్‌సీ తీసుకున్నారు. అదే ప్రాంతంలో కొండాపూర్ ఫీడర్ వైర్లు వెళ్తున్నాయి. దేవయ్య కొండాపూర్ ఫీడర్ వైర్లు ఉన్న స్తంభం ఎక్కడంతో పైనుంచి వెళ్తున్న వైర్లు దేవయ్యకు తాకి విద్యుత్ షాక్ తగిలింది. స్తంభంపై నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన దేవయ్యను వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ యశోద ఆస్పత్రికి తరలించారు.

నేర రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ శ్రీనివాస్

బోధన్: నేర రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా పోలీస్, రెవెన్యూ ఇతర శాఖల సమన్వయంతో కృషిని కొనసాగిస్తున్నామని రాష్ట్ర జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ డాక్టర్ డి శ్రీనివాస్ అన్నారు. గురువారం రాష్ట్ర జైళ్ల శాఖ ఆధ్వర్యంలో బోధన్ శివారులోని బోధన్ – నాందేడ్ అంతర్రాష్ట్ర రోడ్డును ఆనుకుని జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చిన వారితో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను డీఐజీ, జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జిల్లా జైల్ శాఖ అధికారి రాజశేఖర్‌రెడ్డి, బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ జైలుకు వచ్చిన వారిలో 95 శాతం మంది ఉద్రేకం, తెలిసీ తెలియని పరిస్థితుల్లో నేరాలు చేసిన వారే ఉంటారని అన్నారు. మిగిలిన 5 శాతం మంది ప్రత్యేక వాతావరణం, కారణాల వల్ల నేరాలకు పాల్పడిన వారుంటారని పేర్కొన్నారు. జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన వారి కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు జైలు, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో 2012 ఏడాదిలోనే పెట్రోల్ బంక్‌ల ఏర్పాటు ప్రారంభమైందన్నారు. తెలంగాణలో 28 పెట్రోల్ బంక్‌లు ప్రారంభించగా, అవి అమ్మకాల్లో అగ్రస్థానాల్లో ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ప్రతి రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు. బీపీఎల్ మేనేజర్ రమేశ్ కుమార్, టౌన్ సీఐ ప్రేమ్ కుమార్, రూరల్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

జొన్నలు పట్టే ట్రాక్టర్ బోల్తా : మహిళ మృతి



పిట్లం(జుక్కల్): మండలంలోని సిద్ధాపూర్ తండా శివారులో జొన్నలు పట్టే ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై విజయ్ తెలిపిన వివరాలు.. అన్నారం తండాకు చెందిన జొన్నలు పట్టే ట్రాక్టర్‌తో బుధవారం సిద్ధాపూర్ తండాలో జొన్నలు పట్టారు. ట్రాక్టర్‌పై ఉన్న కూలీలను వారి స్వగ్రామం నిజాంసాగర్ మండలంలోని మల్లూర్‌తండాలో దింపడానికి రాత్రి వెళ్తుండగా సిద్ధాపూర్ తండా శివారులో ట్రాక్టర్ బోల్తా పడింది. ముగ్గురు కూలీల కింద పడగా వారిపై ట్రాక్టర్ పడింది. ప్రమాదంలో నునావత్ షానుబాయి (40) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరు కూలీలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త హరిచంద్, ఒక కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. హరిచంద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నవీపేట: మండలంలోని మహంతం గ్రామంలో పది రోజుల కిందట తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన టేకు సాయికుమార్(26) కొన్ని రోజుల నుంచి మహంతం గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పది రోజుల కిందట తీవ్ర గాయాలపాలైన సాయికుమార్‌ను మహంతం గ్రామస్తులు ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి కోమాలోనే ఉన్నాడు. ఒంటిపై తీవ్ర గాయాలకు అసలు కారణాలు తెలియలేదు. ట్రాక్టర్‌పై నుంచి పడి గాయాల పాలయ్యాడా? ఎవరైనా తీవ్రంగా కొట్టారా? అనే విషయాలు చర్చనీయాంశంగా మారాయి. చికిత్స పొందుతూ మృతి చెందడంతో భార్య ఉమ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజారెడ్డి పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి జాలరి..

రెంజల్: నదిలో చేపలు పట్టుకునేందుకు వెళ్లిన వ్యక్తి అదే వలకు చిక్కుకుని మృతిచెందినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బోధన్ మండలం ఆచన్‌పల్లి గ్రామానికి చెందిన మోరె భీంరావ్(55) గురువారం మండలంలోని కందకుర్తి నదిలో చేపలు పట్టేందుకు తమ్ముడు అరుణ్‌తో కలిసి వెళ్లాడు. నదిలో దిగి నీటిలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వలకు చిక్కుకుని నీటిలో మునగడంతో మృతిచెందినట్లు చెప్పారు.

చెరువులో పడి ఒకరు..

రాజంపేట: చెరువులో పడి వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని తలమడ్లలో చోటు చేసుకుంది. గ్రామస్తుల, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిన చంద్రం(40) గ్రామస్తులైన జంగంపల్లి సాయిలు, బోయిని రవితో కలిసి బుధవారం రాత్రి పెద్ద చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. గురువారం ఉదయం వరకు తిరిగి రాకపోవడంతో చంద్రం భార్య నాగమణి తన భర్త ఆచూకీ గురించి సాయిలు, రవిని అడగ్గా బుధవారం రాత్రి చేపలు పడుతుండగా చెరువులో మునిగి చనిపోయినట్లు తెలిపారు. దీంతో చెరువులో గాలించగా చంద్రం మృతదేహం లభ్యమైంది. జంగంపల్లి సాయిలు, రవిపై అనుమానం ఉన్నట్లు ఆమె ఫిర్యాదు చేసిందని ఎస్సై రాజు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

మాక్లూర్: అప్పుల బాధ భరించలేక మండలంలోని కల్లెడి గ్రామానికి చెందిన సారంగుల విజయ్(36) బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. ప్రభుత్వ పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఉన్న విజయ్ మన ఊరు మన బడిలో మంజూరైన కొన్ని పనులకు తానే కాంట్రాక్టు తీసుకుని పూర్తి చేశాడు. ఆ పనులకు సంబంధించి ఇంకా రూ.రెండు లక్షలకు పైగా బిల్లు రావాల్సి ఉందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అవి సకాలంలో రాకపోవటంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎంఈవో రాజ్‌గంగారెడ్డిని వివరణ కోరగా తమ నుంచి మాత్రం విజయ్ ఖాతాలో రూ.5.70 లక్షలు జమ అయ్యాయని చెప్పారు. విజయ్‌కు అప్పుల బాధ ఎక్కువ కావటంతో తాగుడుకు బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బకాయిలు లేవు

నిజామాబాద్‌అర్బన్: కల్లెడి పాఠశాలలో మన ఊరు మన బడి పనులు చేసిన విజయ్‌కు చెల్లించవల్సిన బకాయిలు ఏమి లేవని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయ్ ఆత్మహత్యకు మన ఊరు– మన బడి బకాయిలు రాకపోవడమే కారణమని వస్తున్న ప్రచారం తప్పు అన్నారు. అతనికి చెల్లించాల్సిన రూ.5.70 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు.

కరుడుగట్టిన నేరస్తుడి అరెస్టు

- బీబీపేట వరుస దొంగతనాల కేసులను ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరెడ్డి



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: వారం క్రితం బీబీపేటలో జరిగిన వరస దొంగతనాల కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఓ కరుడుగట్టిన పాత నేరస్తుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరెడ్డి వివరాలు వెల్లడించారు. బీబీపేటలో వారం రోజుల క్రితం మూడిళ్లలో వరుస చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, ఇతర ఆధారాలను బట్టి నిందితుడిని సిద్దిపేట జిల్లా తొగుట మండలం లింగంపేట గ్రామానికి చెందిన వెంగలి భిక్షపతి అలియాస్ చిక్కుడు కృష్ణగా గుర్తించారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం రుద్రారం గ్రామంలోని బంధువుల ఇంట్లో తలదాచుకున్న నిందితుడిని గురువారం అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్పీ తెలిపారు. అతని వద్ద నుంచి జల్సాలకు ఖర్చు చేయగా మిగిలిన 28.5 తులాల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

జల్సాల కోసం చోరీలు

వరుస చోరీల కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకున్న తర్వాత అతడు ఓ కరుడుగట్టిన నేరస్తుడని వెల్లడైంది. జల్సాల కోసం చోరీలకు పాల్పడేవాడు. గతంలో 50 దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉండి పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడు. కరీంనగర్ జైలు నుంచి ఏడాదిన్నర క్రితం విడుదలయ్యాడు ఆ తర్వాత జైలుకు సంబంధించిన పెట్రోల్ బంకులో నెలకు రూ.13,500 జీతానికి పని చేస్తున్నాడు. వచ్చే జీతం డబ్బులు సరిపోక మళ్లీ దొంగతనాలు మొదలుపెట్టాడు. అతడు దొంగతనం చేయడానికి ముందుగా ఓ గ్రామాన్ని ఎంచుకుంటాడు. రెండు నుంచి మూడు రోజులపాటు రెక్కీ నిర్వహిస్తాడు. అప్పటిదాకా పరిసర ప్రాంతాల్లోని చెట్ల కింద ఎవరికి కనిపించకుండా పడుకుంటూ రాత్రి వేళ చోరీలకు పాల్పడి ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతాడు. అక్కడ జల్సాలు చేసి మళ్లీ వస్తాడు. ఈ కేసులో నిందితుడిని గుర్తించడం, అరెస్టు చేయడంలో విశేషంగా కృషి చేసిన కామారెడ్డి డీఎస్పీ సురేష్, భిక్కనూర్ సీఐ తిరుపతయ్య, రూరల్ సీఐ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ మల్లేశం, బీబీపేట, మాచారెడ్డి, రాజంపేట, రామారెడ్డి ఎస్సైలు సాయికుమార్, సంతోష్, రాజు, అనిల్, ఉస్మాన్, సిబ్బంది మైసయ్య, కిషన్, నవీన్, శ్రీనివాస్, ప్రవీణ్, బాలయ్య, శ్రీకాంత్‌ను ఎస్పీ అభినందించారు.

చోరీ కేసులో ఒకరికి జైలుశిక్ష

భీమ్‌గల్: ట్రాక్టర్ ట్రాలీ దొంగతనం చేసిన కేసులో ఒకరికి ఏడాది కఠిన కారాగార శిక్ష పడినట్లు ఎస్సై రాజ్‌భరత్‌రెడ్డి తెలిపారు. మెండోరా మండలం సోన్‌పేట్‌కు చెందిన నర్ర మధు భీమ్‌గల్‌లో ట్రాక్టర్ ట్రాలీ చోరీ చేశాడు. కేసు విచారణ అనంతరం ఆర్మూర్ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వేముల దీప్తి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని సారంగాపూర్ బస్టాప్ వద్ద డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ నిజామాబాద్ సీఐ మంగమ్మ ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేయగా గంజాయి తరలిస్తున్న షేక్ అమీర్ పట్టుబడ్డాడు. షేక్ అమీర్ నుంచి 150 గ్రాముల గంజాయి, బైక్, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఒకరి రిమాండ్

గాంధారి: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని గురువారం రిమాండ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గాంధారికి చెందిన ఒడుసుల సందీప్ (25)పై 2017లో కేసు నమోదైంది. అప్పటి నుంచి కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్యకేసులో ఐదుగురి అరెస్ట్

పరారీలో మరో ఐదుగురు



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: నగరంలోని అసద్‌బాబానగర్ చౌరస్తాలో ఈ నెల 23న జరిగిన మహ్మద్ అర్బాజ్(18) హత్య కేసులో నగరంలోని బాబన్ సాహెబ్ పహాడ్‌కు చెందిన మీర్జా సోహెల్ బేగ్, సర్ఫరాజ్ ఖాన్, సయ్యద్ హుస్సేన్, సయ్యద్ ఖజాపాష, సాజీద్ ఖాన్‌ను అరెస్ట్ చేయగా మరో ఐదుగురు షౌకత్, రఫత్, సమీర్, హాజీ, సైఫ్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం నగరంలోని ఏసీపీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. బాబన్ సాహెబ్‌పహాడ్‌కు చెందిన మీర్జా సోహెల్ బేగ్ డాన్‌లా వ్యవహరించాలని, కొంత మందిని తన వెనుక తిప్పుకోవాలని ఆన్‌లైన్‌లో మూడు కత్తులు కొనుగోలు చేశాడు. సోహెల్‌బేగ్ తనతో గొడవ పెట్టుకుంటే కత్తి చూపించి భయపెట్టి, అవసరమైతే చంపి గుర్తింపు పొందాలని భావించేవాడు. ఈ నెల 22న అర్బాజ్ స్నేహితుడు అఫ్జల్ కారును కిరాయికి తీసుకొని స్నేహితులతో వెళ్తుండగా.. అసద్‌బాబానగర్ చౌరస్తా దగ్గర రోడ్డుపై ఉన్న బురద కారు టైర్‌లకు అంటుకొని, నడుచుకుంటూ వెళ్తున్న హాజీ మీద పడింది. ఈ విషయమై వారి మధ్య గొడవ జరిగింది. దీని గురించి మాట్లాడాటానికి 23న కారు డ్రైవర్ అఫ్జల్‌ను ఇద్రిస్ ఖాన్ వెంచర్ వద్దకు పిలిపించారు. అఫ్జల్‌తో పాటు అతడి స్నేహితులు అర్బాజ్, అజార్, పర్వేజ్, అజీం తదితరులు వెళ్లారు. అక్కడ ఇరువర్గాల మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో సోహెల్ బేగ్, సర్ఫరాజ్ ఖాన్, హాజీ వారి వెంట తెచ్చుకున్న కత్తులు, కట్టెలతో దాడిచేసి అర్బాజ్‌ను మక్బూల్ ప్యాలస్ దగ్గర పట్టుకొని పొడిచి చంపారు. సయ్యద్ హుస్సేన్ తన వద్ద ఉన్న కత్తితో అజార్‌ను చెంపపై పొడవగా అజార్ అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయాడు. ఈ కేసును సవాలుగా తీసుకున్న నార్త్ రూరల్ సీఐ నరహరి దొడ్డి కొమరయ్య కాలనీలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో ఉన్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. కేసును ఛేదించిన సీఐ నరహరి, ఎస్సై సాయినాథ్, ఏఎస్సై రమేష్, కానిస్టేబుళ్లను ఏసీపీ అభినందించారు.